
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 5 మే 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30(ఆదివారం)
కనిష్ఠం : 27

ఎవరి నమ్మకాలు.. వారివి!

నీట్‌లో తమ పిల్లలు ర్యాంక్ సాధించాలనేది తల్లిదండ్రుల ఆశ.. ఆ ఆశను నిజం చేసుకోవాలని రాజమహేంద్రవరం, కాకినాడ, యానాం పరీక్షా కేంద్రాల వద్ద ఒకరు ప్రార్థన చేస్తుంటే.. మరొకరు తాడుకడుతూ.. ఇంకొకరు జాగ్రత్తలు చెబుతూ ఇలా కెమెరాకు చిక్కారు..


గెలుపుతాడు..


కంగారుపడకు..


ధైర్యంగా రాయమ్మా




రెడీ 1


2


3



ఆశలు..బంద్!

ఒక నిమిషం ఆలస్యమై.. ఏడాదంతా తారుమారై!

ఒక్క నిమిషం చాలు జీవితాలు తారుమారైపోవడానికి.. ఆదివారం రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ, కేంద్రం లో నీట్ పరీక్షకు ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు.. కాస్త ముందు వచ్చిన ఇద్దరమ్మాయిలు పరుగున పరీక్షా కేంద్రానికి చేరుకోగా.. ఈ బాలుడు నిమిషం ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయడానికి వీల్లేక వెనుదిరిగాడు.. ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ముంచిన వాన



- జిల్లాలో భారీ వర్షం
- ఈదురుగాలులకు పడిపోయిన కొబ్బరిచెట్లు
- కళ్లాల్లోనే ఉండిపోయిన ధాన్యం రాశులు
- జోరువానతో పలుచోట్ల తడిచిపోయిన ధాన్యం
- ఆవేదనలో రైతులు
- వర్షంతో వేడిమి నుంచి ఉపశమనం పొందిన ప్రజలు

జిల్లాను జోరువాన ముంచెత్తింది. కొన్నిచోట్ల ఈదురు గాలులు వీయడంతో కొబ్బరిచెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. వర్షంతో వేసవిలో వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. కానీ, వరి కోతల సమయం కావడంతో పొలాల్లోని కళాల్లోనే ఉండిపోయిన ధాన్యం తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కె.గంగవరం మండలంలో ధాన్యం రాశుల వద్దకు చేరిన వర్షపునీరు


అల్లవరం మండలం గోడితిప్పలో పడిపోయిన విద్యుత్ స్తంభం

అమలాపురం, మే 4(ఆంధ్రజ్యోతి): మండుటెండల్లో అకాల వర్షం కురిసింది. ఆదివారం ఉదయంనుంచి రెండు గంటల పాటు ఎడతెరిపి లేని భారీవర్షం కోనసీమ్లలో రికార్డుస్థాయిలో కురిసింది. మే నెలలో వర్షాలు ఏంకురు స్థాయనే భావనలోఉన్న అన్నదాతలకు ఈ అకాలవర్షం అపారనష్టాన్నే మిగిల్చింది. జిల్లావ్యాప్తంగా రబీపంట మాసూళ్లు జోరుగా సాగుతున్న తరుణంలో ఆదివారం ఉరుములు, మెరుపులు, గాలుల ప్రభావంతో వర్షం విస్తృతంగా కురిసింది. దీంతో జిల్లావ్యాప్తంగా రబీమాసూళ్లలో బిజీగా ఉన్న రైతులకు నష్టం కలిగించాయి.

అత్యధికంగా అమలాపురంలో..

జిల్లాలో సరాసరి 22.1మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అమలాపురంలో 85మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కొత్తపేటలో అతిస్వల్పంగా 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 1,64,529 ఎకరాల్లో వరిసాగుకాగా ఇప్పటివరకు 80వేలఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. ఇంకా 84,529 ఎకరాల్లో వరికోతకు సిద్ధంగాఉంది. ఈవర్షాలు, గాలులకు కొంతమేర వరి నేలకు ఒరిగింది. జిల్లాలో రైతులనుంచి ఇప్పటివరకు 93వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయగా ఇంకా 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాలు, చేలల్లో ఉంది. కళ్లాలు, చేలల్లోను ఉన్న ధాన్యం రాశుల కిందకు వర్షపునీరు చేరడంతో ధాన్యం రాశుల కింది భాగం తడిసిపోయింది. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. హోర్డింగులు పడిపోయాయి. అమలాపురం పట్టణంతో సహా వివిధ ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.


అయినవిల్లి మండలం నల్లచెరువులో తడిసిన ధాన్యం బస్తాలను తీసుకెళ్తున్న కూలీలు


పి.గన్నవరం మండలం లంకల గన్నవరంలో జోరున కురుస్తున్న వర్షం


ముమ్మిడివరంలో ధాన్యం రాశులను చుట్టుముట్టిన వర్షపునీరు

కాకినాడ సాగరతీరంలో.. ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు


మూడోరోజు పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల

- పురుషుల విజేత జట్టు నెల్లూరు
- మహిళల విజేత జట్టు కృష్ణా
- పోటీల ముగింపునకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి నాదెండ్ల

7

కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి

అమలాపురం, మే 4 (ఆంధ్రజ్యోతి): భగీరథ మహర్షి కఠోర తపస్సుతో గంగను దివి నుంచి భువికి తీసుకువచ్చారని అమలాపురంలోని కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.విశ్వేశ్వరరావు అన్నారు. ఆదివారం వైశాఖ శుద్ధ సప్తమిని పురస్కరించుకుని సగరుల కులదైవమైన భగీరథ మహర్షి జయంతిని కలెక్టరేట్‌లో నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో భాగంగా ఏవో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జలం ఉన్నచోటే సంస్కృతి, నాగరికత వికాసం జరుగుతుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, బీసీ సంక్షేమశాఖ అధికారులు పలువురు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

వైభవంగా వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

7


అన్నవరం సత్యదేవుడి ఆలయ ముస్తాబు

సత్యదేవుడి కల్యాణం చూడగ రారండి!

- 7 నుంచి 13 వరకు ఉత్సవాలు
- అన్నవరంలో ప్రత్యేక ఏర్పాట్లు

అన్నవరం, మే 4(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్వామి వార్షిక కల్యాణోత్సవాలు ప్రతి ఏటా వైశాఖశుద్ధ దశమి నుంచి వైశాఖ బహుళపాడ్యమి వరకు జరుగుతాయి. విశ్వావసు నామసంవత్సరంలో ఉత్సవాలు 7న స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలను చేయడంతో ప్రారంభమై 13వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగ మహోత్సవంతో ముగుస్తాయి. దివ్యకల్యాణం 8న రాత్రి అంగరంగ వైభవంగా జరగనుంది. స్వామి కల్యాణోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాకారం, గోపురాలకు రంగులు వేస్తున్నారు. స్వామివారి సన్నిధిలో జరిగే వేడుకల్లో వార్షిక కల్యాణోత్సవాలకు ప్రాధాన్యం ఉంది. రాష్ట్రం నలుమూలల నుంచి దివ్యకల్యాణం తిలకించేందుకు వేలాదిగా రత్నగిరికి తరలివస్తారు. ఇప్పటికే పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.వారం రోజులు కొండపై వైదిక కార్యక్రమాలతో పాటు కొండదిగువున గ్రామోత్సవాలు (వివిధ వాహనసేవలు) నిర్వహిస్తారు. దివ్యకల్యాణోత్సవాలకు పెండ్లిపెద్దలుగా క్షేత్రపాలకులైన సీతారాములు వ్యవహరిస్తారు. వారం రోజులు ఆర్జితసేవ నిత్యకల్యాణం తాత్కాలికంగా నిలుపుదల చేస్తారు. ఉత్సవాలకు బడ్జెట్‌లో రూ.50 లక్షలు కేటాయించారు.

షెడ్యూల్ ఇలా..

- తొలిరోజు 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. రాత్రి 7గంటలకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు సీతారాములను వెండి ఆంజనేయ వాహనంపై ఊరేగిస్తారు.
- రెండోరోజున రాత్రి 9 గంటలకు స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణం.సత్యదేవుడిని వెండి గజవాహంపై, అమ్మవారిని వెండి గరుడ వాహనంపై పెండ్లి పెద్దలైన సీతారాములను వెండి పల్లకిలో ఊరేగిస్తారు.
- మూడో రోజు సాయంత్రం 6.30 గంటలకు నవదంపతులకు అరుంధతీ నక్షత్ర దర్శన కార్యక్రమం జరుగుతుంది. రాత్రి 9 గంటలకు కొండదిగువున రావణబ్రహ్మ వాహనంపై గ్రామోత్సవం జరగనుంది.
- నాలుగోరోజున మధ్యాహ్నం 2.30 గంటలకు పండిత సదస్యం ఉంటుంది. పండితులు సత్యదేవుడి సన్నిధికి విచ్చేసి నూతన దంపతుల సమక్షంలో తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు.రాత్రి 9గంటలకు పొన్నవాహనంపై గ్రామోత్సవం.
- ఐదోరోజు నూతన దంపతులైన సత్యదేవుడు,అనంతలక్ష్మి అమ్మవార్లను మధ్యాహ్నం 2.30 గంటలకు దేవస్థానం ఉద్యానవనానికి తీసుకువచ్చి వనవిహార మహోత్సవం చేపడతారు. సాయంత్రం 4 గంటలకు పెద్దరథంపై గ్రామోత్సవం
- ఆరో రోజున ఉదయం 5 గంటలకు శేష హోమాలు, కోట్నాలు నిర్వహించి పండితులుఅమ్మవారితో గౌరీపూజ చేయిస్తారు. ఉదయం 9 గంటలకు పంపా సరోవరంలో చక్రస్నానం నిర్వహిస్తారు.
- చివరి రోజున రాత్రి 8 గంటలకు నిత్యకల్యాణమండపంలో శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. వివిధ సుగంధభరిత పుష్పాలతో, స్వామి,అమ్మవార్లను అర్చించి విశేష పదార్థాలను నివేదిస్తారు. కార్యక్రమానికి హాజరైన దంపతులకు దంపతీ తాంబూలాలు, మహిళలకు రవికలను ఉచితంగా అందజేస్తారు.

రుణం ఈజీ కాదు..!



సర్కారు వారి మాటా బ్యాంకులు వినవే!

రుణం అంత ఈజీకాదు.. ప్రభుత్వం తరపున అర్హులని ఎంపిక చేసినా సరే రుణం రాదు.. వెనుక ఏదో ఒక హామీ లేనిదే బ్యాంకులు రుణాలిచ్చేందుకు ముందుకు రావు.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం..అటు పాలకుల నుంచి ఇటు అధికారుల వరకూ చెప్పేది ఇదే.. వారిచెప్పినట్టు జరుగుతుందా అంటే జరగదు.. కార్పొరేషన్ రుణాలే అందుకు ఉదాహరణ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,303 యూనిట్లకు అర్హులను ఎంపిక చేసి 19 బ్యాంకులకు పంపగా కేవలం 1423 మందికి మాత్రమే రుణాలివ్వడానికి ముందుకు వచ్చాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- కార్పొరేషన్ రుణాలకు చుక్కలు
- 6,178 మంది లబ్ధిదారుల ఎంపిక
- 1,423 మందికే లోన్లు మంజూరు
- మిగిలిన దరఖాస్తులు పెండింగ్
- రుణాలివ్వడానికి బ్యాంకుల కొర్రీలు
- రకరకాల కారణాలతో మోకాలడ్డు
- ఉమ్మడి జిల్లాలో లక్ష్యానికి తూట్లు

కార్పొరేషన్ల రుణాలకు బ్యాంకులు కొర్రీలు వేస్తున్నాయి. పేదలను ఆర్థికంగా పైకి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నాయి. లబ్ధిదారులను వడపోత ద్వారా అర్హులను పక్కాగా గుర్తించి రుణాల మంజూరుకు జాబితాలను బ్యాంకులకు పంపితే రకరకాల సాకుతో తిరస్కరించేస్తున్నాయి.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ పథకాలకు ఎంపిక చేసిన 6,178 మంది లబ్ధిదారుల వివరాల ను 19 బ్యాంకులకు పంపగా వీరిలో కేవలం 1,423 మందికి మాత్రమే రుణాలివ్వడానికి ఆమోదం తెలిపాయి. మిగిలిన దరఖాస్తుల్లో కొన్ని తిరస్కరించగా.. మరికొన్ని పెండింగ్‌లో ఉంచేశాయి.

ఎంపికకే నానా తంటాలు..

గత వైసీపీ ప్రభుత్వంలో బీసీ,కాపు, ఈడబ్ల్యూఎస్ రుణాలకు మంగళం పాడేసింది. 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దిగిపోయే సమయానికి అందివ్వాల్సిన యూనిట్లను సైతం పక్కన పడేసింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది మంది బీసీ, కాపు సామాజికవర్గాల పేదలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చంద్రబాబు తాజాగా సీఎం అయిన తర్వాత మళ్లీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 7,303 యూనిట్లు కేటాయించారు. స్వయం ఉపాధి యూనిట్లకు వీలుగా 50 శాతం సబ్సిడీతో రుణం ఇప్పించాలని నిర్ణయించింది. ఉదాహరణకు ఎంపికైన లబ్ధిదారుడు జనరిక్ మందుల దుకాణం ఏర్పాటుచేయ్యే రూ.8 లక్షల్లో రూ.4 లక్షలు రాష్ట్రప్రభుత్వం సబ్సిడీ భరిస్తుండగా మిగిలిన రూ.4 లక్షలు రుణం మంజూరు చేస్తారు. ఇలా రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు రుణాలకు లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించింది.ఈ పథకానికి ఉమ్మడి జిల్లా నుంచి భారీగా స్పందన వచ్చింది. మంజూరైన యూనిట్లు 7,303 దరఖాస్తు చేసుకున్నవారు 1.11 లక్షల మంది.ఎలాగైనా పథకం తమకే దక్కాలని అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులతో సిఫార్సు చేయించారు. దరఖాస్తులన్నీ పరిశీలించిన అధికారులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 7,303 మంది లబ్ధిదారులను అతికష్టంపై ఎంపిక చేశారు. కాకినాడ జిల్లా నుంచి 2,684 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 2,314, కోనసీమ జిల్లా నుంచి 2,305 మందిని ఎంపిక చేశారు. వీరికి ప్రభుత్వం తరపున సబ్సిడీ అందేలా ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపారు.వీరందరికి బ్యాంకు రుణాలు అందేలా ఆయా మండలాల్లో ఎండీవోలు సంబంధిత బ్యాంకు బ్రాంచ్‌లకు సిఫార్సు చేశారు.సబ్సిడీ పోను మిగిలిన సగం రుణం కింద ఇవ్వాలని యూనిట్ల వివరాలతో పంపించారు.

పేదలకు సిబిల్ స్కోర్ లేదట?

ఉమ్మడి జిల్లాలో ఆయా మండలాల వారీగా ఎండీవోలు లబ్ధిదారుల జాబితాను బ్యాంకులకు పంపించారు. తీరా వీటిని పరిశీలించిన బ్యాంకులు రుణాలివ్వడానికి నానా తిప్పలు పెడుతున్నాయి. లబ్ధిదారుడి సిబిల్ స్కోరు బాగోలేదని.. గతంలో బ్యాంకు రుణం సరిగ్గా చెల్లించలేదని, గతంలో వేరే పథకానికి ఎంపికయ్యారని తదితర కారణాలతో ఎక్కడికక్కడ రుణాలివ్వ కుండా తిరస్కరిస్తున్నాయి.ఎంపిక చేసిన యూనిట్‌కు రుణం ఇవ్వడానికి కుదరదంటూ రకరకాల సాకులు చెబుతున్నాయి. కార్పొరేషన్ రుణాలకు ఎంపికైన లబ్ధిదారులంతా నిరుపేదలు.వీరికి అసలు సిబిల్ స్కోరు గురించి కనీస అవగాహన ఉండదు.కానీ ఆ పేరుతో రుణాలు ఇవ్వకుండా తిరస్కరిస్తుండడంతో ఆయా పేద లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం చొరవ చూపి పేదలకు సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

1423 మందికి మాత్రమే..

కాకినాడ జిల్లాలో ఇలా..

కాకినాడ జిల్లాలో 19 బ్యాంకులకు అధికారులు 2,478 మందిని ఎంపిక చేసి దరఖాస్తుల జాబితా పంపారు. వీటిలో కేవలం 722 మందికే బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయి.199 తిరస్కరించగా 1,557 పెండింగ్‌లో ఉంచేసి వీటిని కూడా రేపోమాపో తిరస్కరిస్తున్నట్టు వెల్లడించనున్నాయి. ఎస్‌బీఐకి 773 దరఖాస్తులు పంపితే 243 మంజూరు చేసి 98 దరఖాస్తులను తిరస్కరించింది. మరో 432 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచేసింది. యూనియన్ బ్యాంకుకు 746 మంది జాబితా పంపితే 242 మందికే రుణాలు మంజూరు చేసింది. 40 దరఖాస్తులను తిరస్కరించి 464 పెండింగ్‌లో ఉంచేసింది.

తూర్పుగోదావరి జిల్లా

తూర్పుగోదావరి జిల్లాలో 15 బ్యాంకులకు 2,062 మంది జాబితా పంపగా కేవలం 353 మందికే రుణాలివ్వడానికి అంగీకరించాయి. 66 మంది రుణ దరఖాస్తులు తిరస్కరించగా 1,643 పెండింగ్‌లో ఉంచేశాయి. స్టేట్ బ్యాంకుకు 657 దరఖాస్తులు పంపితే 84 మంది రుణాలకు మాత్రమే ఓకే చెప్పింది. 12 మందివి తిరస్కరించి 511 పేర్లు పెండింగ్‌లో ఉంచేసింది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుకు 57 పేర్లు పం పితే ముగ్గురికే రుణం మంజూరు చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ ,పంజాబ్ నేషనల్ బ్యాంకు, సిటీ యూనియన్ బ్యాంకు ఒక్క లోను ఇవ్వలేదు.

కోనసీమ

కోనసీమ జిల్లాలో 14 బ్యాంకులకు 1,638 పేర్లు పంపితే 348 మందికి మాత్రమే లోన్లు మంజూరయ్యాయి. 205 దరఖాస్తులు తిరస్కరించగా 1,085 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచేశాయి.కెనరా బ్యాంకుకు 100 పంపితే 35 మందిని తిరస్కరించింది.చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు 115 పంపితే 30 తిరస్కరించింది. స్టేట్‌బ్యాంకుకు 509 పంపితే 34 మందికే రుణాలిచ్చి 21 పేర్లు తిరస్కరించింది. యూనియన్ బ్యాంకుకు 532 పంపితే 161 మందికే లోన్లు ఇవ్వగా 85 తిరస్కరించింది. వేలల్లో పేర్లను బ్యాంకులు తిరస్కరిస్తుండడంతో అటు బీసీ కార్పొరేషన్, ఇటు ఎండీవోలు తలలు పట్టుకుంటున్నారు.ఒకసైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చాలా నీట్‌గా..!


రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో నీట్ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

చెవి దిద్దులు తీసివేస్తూ...


జడలో క్లిప్పు తొలగిస్తూ...

నీట్ పరీక్షలు అంటే తొలుత గుర్తొచ్చేది తనిఖీ అంశం. అధికారులు, పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఆదివారం రాజమహేంద్రవరం, కాకినాడ కేంద్రాల వద్ద విద్యార్థులు నీట్ పరీక్ష రాసేందుకు సంసిద్ధమైన దృశ్యాలే ఇవి



కాకినాడలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, వారి కోసం వర్షంలో కుటుంబసభ్యులు

ముత్యాల తలంబ్రాలు 30వేల ప్యాకెట్లు సిద్ధం

సత్యదేవుని కల్యాణం తిలకించే భక్తులకు అందజేసే ఏర్పాట్లు


ముత్యాల తలంబ్రాలను ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

అన్నవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వతేదీ రాత్రి జరిగే సత్యదేవుని కల్యాణం సందర్భంగా స్వామి,అమ్మవార్లు ఒకరిపై ఒకరు వేసుకునే ముత్యాల తలంబ్రాలను అధికారులు ప్యాకింగ్ రూపంలో తయారుచేస్తున్నారు. సుమారు 30వేల ప్యాకెట్లను తయారుచేసి కల్యాణం అనం తరం 9 ప్రత్యేక కౌంటర్ల ద్వారా కల్యాణం వీక్షించేందుకు విచ్చేసే భక్తులకు అందజేయనున్నారు. సేవాసంస్థ మహిళలకు ఈ బాధ్యతను అప్పగించారు.

వెండివాహనాలకు మెరుగులు

సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల 7నుంచి ప్రారంభమయ్యే గ్రామసేవల్లో స్వామి,అమ్మవార్ల ఊరేగింపునకు వినియోగించే వెండివాహనాలకు మెరుగులు దిద్దుతున్నారు. కాకినాడకు చెందిన శ్రీ లక్ష్మీశ్రీనివాస జ్యూయలరీ వర్క్స్ అధినేత పాటోజు వెంకట లక్ష్మణమూర్తి, ఆయన బంధుమిత్రులు ఈ పనిని ఉచితంగా చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. తొలిరోజున వెండి ఆంజనేయవాహనం, రెండోరోజున వెండి గరుడవాహనం, వెండిగజవాహనం, వెండిపల్లకి, స్వామి, అమ్మవార్లు కల్యాణానికి ఆసీనులయ్యే వెండి సింహాసనం, వెండిరథం త దితర సేవలు కల్యాణోత్సవాల్లో జరగనున్నాయి.


వెండి వాహనాలకు తుదిమెరుగులు దిద్దుతున్న దృశ్యం

పలు సేవలు నిలుపుదల

ఈనెల 7 నుంచి 13 వరకు సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా పలు ఆర్జితసేవలను తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి నిత్యకల్యాణం, ఆయుష్యహోమం, సహస్రదీపాలంకరణ సేవ, పంచహారతులసేవ, శుక్రవారం జరిగే చండీహోమం, శనివారం జరిగే ప్రాకారసేవ, ఆదివారం జరిగే రథసేవ, పౌర్ణమిరోజున జరిగే ప్రత్యంగిర హోమాలు నిలుపుదల చేస్తామని భక్తులు ఈ విషయాన్ని గమనించాలని అధికారులు కోరారు.

ఆహ్వానపత్రికల అందజేత

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలకు రావాలని ఆదివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూలకు ఈవో వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ ఆహ్వానపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహ 'బరి'తం..

- కాకినాడ సాగరతీరంలో ముగిసిన కబడ్డీ పోటీలు
- పురుషుల విజేత నెల్లూరు
- మహిళల విజేత కృష్ణా

సర్పవరం జంక్షన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో మూడు రోజులు జరిగిన బీచ్ కబడ్డీ పోటీలు ఆద్యంతం అలరించాయి. అలల హోరు మధ్య కూతల మోతతో కాకినాడ సముద్ర తీరం మార్మోగింది. ఫ్లడ్‌లైట్ల వెలుగులో.. అభిమానుల గోలతో అక్కడంతా సందడి వాతావరణం నెలకొంది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, కాకినాడ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సౌజన్యంతో కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో జ రుగుతున్న 12వ అంతర జిల్లాల రాష్ట్ర బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్-2025 పోటీలు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, అనపర్తి, అమలాపురం, కాకినాడ సిటీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అయితాబత్తుల ఆనందరావు, వనమాడి కొండబాబు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, ఇతర ప్రజాప్రతినిధులు తిలకించారు.

విజేతల వివరాలు...

చివరిరోజు మహిళల విభాగంలో చిత్తూరు-కృష్ణా జిల్లాల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది. పురుషుల విభాగంలో నెల్లూరు, ప్రకాశం జట్లు హోరాహోరీగా తలపడగా నెల్లూరు జట్టు చాంపియన్‌గా నిలిచింది. రన్నరప్‌గా ప్రకాశం జట్టు నిలిచింది. విజేతలకు మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, జ్యోతుల నెహ్రూ, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎస్పీ బిందుమాధవ్ బహుమతులను ప్రదానం చేశారు.


పురుషుల చాంపియన్ నెల్లూరు జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు


హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు



మహిళల చాంపియన్ కృష్ణా జట్టు



వైభవంగా వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

విశేష అభిషేక పూజలు, చండీహోమం

ఐ.పోలవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో నాల్గోరోజు ఆదివారం గవ్యాంతము, విశేష అభిషేక పూజలు, చండీహోమం, కళాహోమం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సాయంత్రం స్వామివారు నంది వాహనంపై ఆసీనులై మురమళ్ళ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సదస్యం, సభపూజ, పండిత సత్కారం కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల మూల విరాట్లను ప్రత్యేకంగా అలంకరించి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో భద్రకాళీసమేతవీరేశ్వరస్వామి


చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అయోధ్య రామధనస్సుకు పూజలు

అయోధ్య రాముని కోసం తయారుచేసిన ధనస్సుకు భద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం అయోధ్య రాముని కోసం కిలో బంగారం, 13 కిలోల వెండితో ధనస్సును తయారు చేయించారు. ధనస్సుకు ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మేళతాళాలతో, మంగళహారతులతో స్వాగతం పలికారు. స్వామివారి మూలవిరాట్ వద్ద యనమండ్ర సత్యసీతారామ శర్మ, యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేసులో శిక్ష పడుతుందనే భయంతో..

- వ్యక్తిని హత్య చేసిన యవకుడు ● అరెస్ట్ చేసిన నిడదవోలు పోలీసులు


ఘటనా స్థలంలో షేక్ వలీ బాషా మృతదేహం


ఫైల్‌ఫొటో


హత్య చేసిన అనిల్‌కుమార్

నిడదవోలు, మే 4 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిని అల్లరి చేసిన కేసు కోర్టులో తుది దశకు రావడంతో శిక్ష పడుతుందనే భయంతో, అమ్మాయి కుటుంబసభ్యులు రాజీకి రాకపోవడంతో ఆదివారం ఉదయం యువకుడు వ్యక్తిని హత్య చేశాడు. హత్యచేసిన అరగంటలోనే పో లీసులు నిందితుడిని అరెస్టు చేశారు. సీఐ పివి జి.తిలక్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు పట్టణం పాటిమీద చింతచెట్టు వీధిలో నివాసముంటున్న షేక్ వలీ బాషా (46) ఆదివారం ఉదయాన్నే నిద్ర లేచి తన ఇంటి కింద ఉన్న కిల్లీ షాపు తె రుస్తుండగా స్థానిక వైఎస్సార్ కాలనీకి చెందిన శిరంగుల అనిల్‌కుమార్ వేటకత్తితో వలీ బాషాను హత్య చేసినట్టు మృతుడి భార్య షేక్ రెహనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. లారీ డ్రైవర్ అయిన అనిల్‌కుమార్ 2021లో వలీ బాషా కుమార్తెను అల్లరి చేయడంతో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో విచారణ జరుగుతుంది. తనపై కేసు ఉండడంతో పెళ్లి కావడంలేదని, మరోపక్క ఈ కేసులో శిక్ష పడుతుందనే భయంతో అనిల్ వలీ బాషాను రాజీ చేసుకుందామంటూ చాలా కాలంగా తిరుగుతున్నాడు. అయితే వలీ బాషా కుటుంబసభ్యులు రాజీకి సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అనిల్ పథకం ప్రకారమే వేటకత్తితో వచ్చి వలీ బాషాపై దాడి చేసి హత్య చేశాడని పోలీసులు పేర్కొన్నారు. సమాచారం అందిన అరగంటలోనే సీఐ తిలక్ సిబ్బందితో అనిల్‌ను అరెస్ట్ చేశారు. మృతుడి భార్య షేక్ రెహనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రేపు ఖేలో ఇండియా బీచ్ క్రీడల ఎంపికలు

కార్పొరేషన్(కాకినాడ), మే 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 24 వరకు డయ్యూ, యుటి ఆఫ్ దాదర్, నగర్ హవేలి, డామన్, డయ్యూలో జరగబోయే ఫస్ట్ ఎడిషన్ ఖేలో ఇండియా బీచ్ క్రీడలు 2025కు రాష్ట్రం తరుపున బీచ్ కబడ్డీ(పురుషులు, బీచ్ వాలీబాల్(మహిళలు), బీచ్ ఫుట్‌బాల్(మహిళలు), సెపక్ తక్ర(పురుషులు, మహిళలు) జట్లను ఎంపిక ఎంపికలు మంగళవారం జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు మంగళవారం ఆయా జిల్లాల్లో నిర్వహించే ఎంపికలకు హాజరుకావాలని, ఆయా జిల్లాల జిల్లా క్రీడా అభివృద్ధి అధికారులను సంప్రదించాలని కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. మే 6న బీచ్ కబడ్డీ (పురుషులు), బీచ్ వాలీబాల్(మహిళలు), బీచ్ ఫుట్‌బాల్ (మహిళలు) ఎంపికలకు క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లా కృష్ణానది వద్ద జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి నెంబరు 9394494645 నెంబరును సంప్రదించాలన్నారు. ఓపెన్ ఏజ్ కేటగిరి, క్రీడా ఆధారిత వయో పరిమితి ఏదైనా ఉంటే వాటి ఆధారంగా వయస్సు నిర్థాణకు ఆధార్‌కార్డు లేదా పాస్‌పోర్టు, పదో తరగతి మార్కుల లిస్ట్, జనన ధృవీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. రాష్ట్రం తరఫున పాల్గొనే క్రీడాకారులు రాష్ట్రంలో స్థానిక నివాసం, పాస్ పోర్టు, స్కూల్ బోనఫైడ్, ఉద్యోగం చేస్తుంటే పోస్టింగ్ ప్రదేశం, ఈ మధ్యనే గెలుపొందిన క్రీడాపత్రాలు, పాస్ పోర్టు ఫోటోలు తీసుకెళ్లాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

సమస్యల పరిష్కారానికి సహకారం : ఎమ్మెల్సీ


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజశేఖరం

కాకినాడ సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం హామీ ఇచ్చారు. కాకినాడ సూర్యకళామందిరంలో యుపీఈఐఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సమావేశానికి ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. యూపీఈఐఎఫ్ ఫౌండర్, ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్, ఛైర్మన్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సంఘాల పిలుపుతో ఈనెల 7న తలపెట్టిన 'చలో విజయవాడ'కు అన్ని మండలాల నుంచి పెద్దసంఖ్యలో యాజమాన్యాల సభ్యులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ పునాదిలో పాము

కొట్టి చంపిన గ్రామస్తులు


హతమైన పాము

ఎటపాక, మే 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం కన్నాయిగూడెం ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం భవనం పునాది రంధ్రాల్లో పాములు సంచరిస్తూ ఉండడంతో చిన్నారులు భయాందో ళనకు గురవుతున్నారు. ఈక్రమంలో ఆదివారం స్థానికులు అమర్చిన వలలో 4 అడుగుల పాము చిక్కుకుంది. దాంతో గ్రామస్తులు పామును హతమార్చారు. అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

'లోవ'కు పోటెత్తిన భక్తులు

రూ.4.57 లక్షల ఆదాయం


ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ

తుని రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.4.57 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. భక్తుల కోసం ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలందజేశారు.


క్యూలో బారులుతీరిన భక్తులు

వేములవాడ భీమకవి విగ్రహావిష్కరణ

కరప, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం వేములవాడ భీమకవి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. బ్రహ్మశ్రీ పూజ్యం విశ్వనాథ శివాచార్య ఆధ్వర్యం లో భైరవబొట్ల మాచరి బ్రహ్మజీ శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యాగశాలలో ఉదయం నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, పలు హోమాలు నిర్వహించారు. గ్రామస్తులు భారీఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, లారీ ఓనర్స్ అధ్య క్షుడు దుగ్గన బాబ్జి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు బండే తాతాజీ, పీజీ సత్యనారాయణ, దుగ్గ న బాబ్జి, మీసాల రాంబాబు, పాలిక వీర్రాజు, పాలిక సూరిబాబు, కమిడి భీమశంకర్, పుణ్యమంతుల అప్పారావు, గ్రామ పెద్దలు తదితరులున్నారు.


ఆలయంలో భీమకవి విగ్రహానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

భారీ వర్షంతో నిలిచిన పాపికొండల బోటు

దేవీపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి అధికారులు పాపికొండలకు వెళ్లే బోటును నిలిపివేశారు. రోజూ పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి విహారయాత్రికులు పాపికొండలకు వెళ్తుంటారు. ఆదివారం ఉదయం ఈదురుగాలులతో వర్షం కురవడంతో అధికారులు పర్యాటక బోటును నిలిపేశారు. 250మంది అడ్వాన్స్ బుక్ చేసుకున్నారు. అయితే అక్కడికి వచ్చిన వారంతా నిరాశతో వెనుదిరిగారు.

మాజీ మంత్రి ఇంట్లో దొంగతనంపై కేసు

కొవ్వూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కెఎస్.జవహర్ ఇంట్లో దొంగలు పడి రూ.2,40,000 విలువైన వస్తువులు దొంగిలించుకుపోయినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నందమూరు రోడ్‌లో ఉన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎక్సైజ్‌శాఖ మాజీ మంత్రి కెఎస్.జవహర్ కుటుంబసభ్యులు గత నెల 28న ఇంటి తాళాలు పెట్టి తిరువూరు మండలం గానుగపాడు వెళ్లారు. ఈనెల 3న సాయంత్రం 4-30 గంటల సమయంలో మొక్కలకు నీళ్ల పోయడానికి వీధి రాజు వచ్చాడు. ఇంటి వెనుక తులపులు తెరచి ఉండడంతో జవహర్ కుమారుడు కొత్తపల్లి ఆశిష్ అమృత్‌లాల్‌కు సమాచారం అందించాడు. హుటాహుటిన వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. హాలులో తలుపులు పగలగొట్టి బెడ్ రూమ్‌లోని 3 ఐరన్‌కేఫ్‌ల తలుపులు తెరచి లోపల ఉన్న వస్తువులన్నీ చెల్లాచెదురుగా ఉన్నాయి. ఇంట్లో అన్నీ పరిశీలించగా 4 బంగారు ఉంగరాలు (సుమారు 4 కాసులు), 4 సిల్వర్ ప్లేట్లు (సుమారు 2 కిలో గ్రాములు), రూ.45 వేలు నగదు, ఒక వాచ్, 32 ఇంచెస్ సామ్‌సంగ్ టీవీ, 2 సామ్‌సంగ్ ఫోన్లు, కొన్ని పట్టుచీరలు కలిపి సుమారు రూ2,40,000 విలువైన వస్తువులు దొంగతనం జరిగినట్టు గుర్తించారు. దీనిపై జవహర్ కుమారుడు కొత్తపల్లి ఆశిష్ అమృత్‌లాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ జి.దేవకుమార్, సీఐ విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజమహేంద్రవరం నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విశ్వం తెలిపారు.

కొరియర్ కార్యాలయంపై పిడుగుపాటు

ఎటపాక, మే 4 (ఆంధ్రజ్యోతి): కొరియర్ సర్వీస్ నిర్వహిస్తున్న గదిపై పిడుగుపడిన ఘటన ఆదివారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం సీతాపురంలో జరిగింది. ఈకంప్ ఎక్స్‌ప్రెస్ కొరియర్ సర్వీస్ కార్యాలయంపై పిడుగుపడి కంప్యూటర్, ఎలక్ట్రికల్ పరికరాలు దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలార్పారు. కాలిపోయిన ఎలక్ట్రికల్ పరికరాల విలువ రూ.50వేలుంటుందని నిర్వాహకులు చెప్పారు.

ఆలయం ఆహ్లాదం


ఈ చిత్రం.. అన్నవరం సత్యదేవుని ఆలయంపై అలముకున్న అబ్బులు స్వర్ణ శోభితమై ఆలయ పరిసరాలు మొత్తం ఆహ్లాదరకంగా మారి ఆహా అనిపించిన దృశ్యం

ఫొటోగ్రాఫర్-కాకినాడ

కల్యాణోత్సవానికి పందిరిరాట ముహూర్తం

అంబాజీపేట, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు సంబంధించి ఆదివారం పందిరిరాట ముహూర్తం నిర్వహించారు. ఈనెల7న రాత్రి వేంకటేశ్వరస్వామివారి కల్యాణం, 8న స్వామివారి ఆలయం వద్ద తీర్థం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆర్థిక భరోసా కోసమే కుట్టుమిషన్ ట్రైనింగ్

ఐ.పోలవరం, మే 4(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక భరోసా కోసం కూటమి ప్రభుత్వం కుట్టుమిషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. గుత్తెనదీవిలో కుట్టుమిషన్ కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. 90రోజులు శిక్షణ తీసుకున్న మహిళలకు కుట్టుమిషన్లు ఇస్తామన్నారు.

ముమ్మిడివరంలో చెత్త సమస్య



గంటావారి వీధి రోడ్డులో డంపింగ్ యార్డులో వేసిన చెత్త రోడ్డుపై చేరి చిందరవందరగా ఉన్న దృశ్యం

ముమ్మిడివరం, మే 4(ఆంధ్రజ్యోతి): చెత్త వేయడానికి అవసరమైన అనువైన స్థలం లేదు. ప్రస్తుతం చెత్త వేస్తున్న డంపింగ్ యార్డు నిర్వహణ కూడా సక్రమంగా లేదు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులు ఉండగా 25,350మంది జనాభా ఉన్నారు. 6,330 కుటుంబాలు నివసిస్తున్నాయి. నగర పంచాయతీ రూరల్ ప్రాంతంలో చెత్త సమస్య అంతగా లేదు. పట్టణ పరిధిలోని 3, 4, 5, 6, 16, 17, 18, 19 వార్డుల నుంచి ఎక్కువ మొత్తంలో చెత్త వస్తుంది. నగర పంచాయతీ స్థాయికి తగినట్టుగా డంపింగ్ యార్డు లేకపోవడంతో చెత్త సమస్య వేధిస్తోంది. ముమ్మిడివరం మార్కెట్ ప్రాంతంలో కొత్తలంకకు వెళ్లే రోడ్డు, గంటావారి వీధి రోడ్డు మధ్య ఉన్న స్థలంలోకి చెత్తను తరలిస్తున్నారు. స్థలం తక్కువగా ఉండడంతో సేకరించిన చెత్త ఎక్కువగా ఉండడంతో రోడ్డుపై వరకు చెత్త వచ్చి ఆ చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. చెత్త నుంచి వెలువడే దుర్గంధానికి తోడు డంపింగ్ యార్డులో చెత్తను కాల్చివేయడంతో పొగ వ్యాపించి ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆ ప్రాంతమంతా దుర్గంధం వెలువడడమే కాకుండా వాయు కాలుష్యం ఏర్పడుతోంది. హోటళ్లు, కోడి, మాంసం, చేపల దుకాణాల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలతో పాటు ఆసుపత్రి నుంచి వచ్చే వ్యర్థాలను కూడా ఇక్కడికే తరలిస్తున్నారు. రోజుకు 10-12 టన్నుల చెత్త వస్తుంది.

ముమ్మిడివరం నగర పంచాయతీ కాకముందు పంచాయతీగా ఉన్నప్పుడు కూడా చెత్తను ఇక్కడికే తరలించేవారు. చెత్తను రోడ్డుపక్కన వేయడం వల్ల కొత్తలంక, అగ్రహారం, అయినాపురం బాడవ, కర్రివానిరేవు, మర్లపాలెం వెళ్లే ప్రజలు, గంటావారివీధికి వెళ్లేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆ ప్రాంతంలో సత్తెమ్మ తల్లి ఆలయం కూడా ఉంది. ఆలయానికి వచ్చే భక్తులు చెత్త సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. డంపింగ్ యార్డు నుంచి చెత్త ఆలయం వరకు చేరడంతో ప్రజల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 38 మీటర్ల మేర గోడను స్వచ్ఛందంగా నిర్మింపచేశారు. అయినా డంపింగ్ యార్డులో చెత్తను పందులు, కుక్కలు రోడ్డుపైకి లాక్కు వచ్చి చిందరవందర చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతమంతా కలుషితమై దుర్గంధం వ్యాపిస్తోంది. చినుకు పడితే చాలు ఆ ప్రాంతమంతా దుర్వాసనతో నిండిపోతోంది. కంపోస్టు యార్డును ఊరికి చివరగా స్థలం సేకరించి అక్కడికి మార్పు చేయాలని, చెత్త సమస్యను పరిష్కరించాలని నగర పంచాయతీ సమావేశంలో పలుసార్లు తీర్మానం చేసినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. దీంతో ప్రజలకు పాట్లు తప్పట్లేదు. డంపింగ్ యార్డు అస్తవ్యస్తంగా ఉండడంతో ఆ ప్రాంతంలో దోమలు విపరీతంగా పెరిగిపోయి అక్కడి ప్రజలు డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడుతున్నారు.

ఊరికి దూరంగా ఏర్పాటుచేయాలి
అడబాల సతీష్‌కుమార్, కౌన్సిలర్



ఆ రోడ్డు గుండా ప్రయాణించే ప్రజలు, అక్కడ నివసిస్తున్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. డంపింగ్ యార్డును ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలి. చెత్తను అక్కడ పడవేయడం వల్ల కాలుష్యం వెలువడి ప్రజలు రోగాలపాలవుతున్నారు. దీనికి తోడు అప్పుడప్పుడు చెత్తను అంటించడం వల్ల వచ్చే పొగను పీల్చడంతో ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి చేయాలి
ములపర్తి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్



పట్టణంలో సేకరించిన చెత్తనంతా డంపింగ్ యార్డులో కాకుండా రోడ్డు పక్కనే పడవేస్తున్నారు. పందులు, కుక్కలు ఆ చెత్తను రోడ్డుపైకి చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధంగా మారి అటు వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉంటోంది. ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

కిమ్స్‌లో ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు



స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్న కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది

అమలాపురం, మే 4(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి దశ వార్షిక బ్రహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం సుదర్శన హోమం, పూర్ణాహుతి, చక్రస్నాన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామోత్సవంలో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై ఉంచి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం పర్యంక శయనోత్సవం, ఆశీర్వచనం, పండిత సత్కారం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాల వితరణ జరిగాయి. కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు-బదరీలక్ష్మి, ఎండీ కె.రవికిరణ్‌వర్మ-శేషపవిత్ర దంపతులు కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అకాల వర్షం.. రైతులు కుదేలు

- తడిసిన ధాన్యం, వరి పనలు
- నష్టం మిగిల్చిన వర్షం







మామిడికుదురులో ధాన్యం రాశులపై బరకాలు కప్పిన దృశ్యం, ముమ్మిడివరం: వర్షానికి తడిసిన పనలను చూస్తున్న రైతు, అంబాజీపేట: రాశులపై బరకాలు కప్పిన దృశ్యం

పి.గన్నవరం, మే 4(ఆంధ్రజ్యోతి): ఈఏడాది రెండో పంటను ఒబ్బిడి చేసుకునే సమయంలో అన్నదాతకు ఆగచాట్లు తప్పడం లేదు. అన్నీ అవాంతరాలే ఎదురవుతున్నాయి. వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో అన్నదాత కల వరపడుతున్నాడు. మరో పక్క ధాన్యం కొనుగోలు విషయంలో టార్గెట్లు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. కోతలు పూర్తయి నప్పటికి ఎక్కువ శాతం ధాన్యం ఇంకా రాశులుగానే ఉంది. ఆదివారం భారీ వర్షం కురవడంతో అన్నదాతలు అప్రమత్తమ య్యారు. ఒబ్బిడి చేసుకున్న ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఇప్పటికే పలు గ్రామాల్లో రాశులతో పాటు ధాన్యం బస్తాలు సైతం చేల మధ్యలోనే ఉన్నాయి. భారీ వర్షం కురవడంతో ధాన్యం బస్తాలు, రాశులపై బరకాలు కప్పారు. చేలన్నీ బురద మయంగా మారడంతో వరి కోత యంత్రం చేలల్లో దిగడానికి ఇబ్బందికరంగా మారింది. వర్షంతో పాటు ఈదురుగాలులు కారణంగా పలుచోట్ల కొబ్బరి చెట్లు సైతం నేలనంటాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

భారీ వర్షం

మలికిపురం, మే 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం పిడుగులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. నాలుగు గంటల పాటు కురిసిన వర్షంతో రైతులు పలు ఇబ్బందులు పడ్డారు. చాలాచోట్ల చేలల్లోనే ధాన్యం రాశులు ఉండిపోయాయి. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు తక్కువ టార్గెట్ నిర్ణయించడంతో చాలా మంది రైతుల వద్ద ధాన్యం ఉండిపోయింది. దీనికితోడు ఎండుగడ్డి ఒబ్బిడి కాకపోవడంతో రైతులు నష్టపోయారు. తీరప్రాంతంలోని సరుగుడు కొబ్బరి తోటలకు వర్షం మేలు చేస్తుందని రైతులు అంటున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రోడ్లపైనే కుప్పలుగా వరి

అంబాజీపేట, మే 4(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి అధికంగా వర్షం కురిసింది. ధాన్యం రాశులపై బరకాలు కప్పేం దుకు రైతులు పరుగులుతీశారు. మండలంలో 50శాతం వరి కోతలు పూర్తికాగా ధాన్యాన్ని కల్లాల్లోనే రైతులు భద్రపరుచుకున్నారు. ముసలపల్లి, గంగలకుర్రు తదితర ప్రాంతాల్లో రైతులు ధాన్యాన్ని నూర్పులు చేసి రోడ్లపైనే బస్తాలు వేసి బరకాలతో భద్రపరిచారు. వర్షంతో వరికోత యంత్రాలు గట్టుకు చేరుకున్నాయి. ఎండలతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వర్షంతో ఉపసమనం పొందారు. వర్షాలు ఉద్యాన పంటలకు మేలు జరుగుతుందని రైతులు తెలిపారు. వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

దాళ్వా రైతుల గగ్గోలు

మామిడికుదురు, మే4(ఆంధ్రజ్యోతి): ఆదివారం కురిసిన అకాల వర్షానికి దాళ్వా రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునే దశలో ఆదివారం అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం రాశులను రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పండించిన ధాన్యాన్ని తడవకుండా టార్పాలిన్లు కప్పుకుని రక్షించుకునే పనిలో రైతులు ఉన్నారు. పలుచోట్ల చేలల్లోని పనలు కురిసన వర్షానికి తడిసి ముద్దయ్యాయి. కొన్నిచోట్ల ధాన్యం రాశుల్లో చేరిన వర్షం నీరు బయటకు తోడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కురిసిన భారీ వర్షం నష్టాల పాలు చేసిందని రైతులువాపోతున్నారు.

అయినవిల్లిలో భారీ వర్షం

అయినవిల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో అయినవిల్లిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈభారీ వర్షంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో అకాల వర్షం రైతులను ఇబ్బందుల పాలు చేసింది. కోసిన ధాన్యాన్ని రైతులు రహదారులపై ఆరబెట్టుకుంటున్నారు. అకాల వర్షంతో ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తడిసి ముద్దయిన ధాన్యం

రాజోలు, మే 4(ఆంధ్రజ్యోతి): రాజోలు మండలంలోని గ్రామాల్లో ఆదివారం కురిసిన అకాల వర్షానికి చేతికి వచ్చిన వరి పంట తడిసి ముద్దవ్వడంతో అన్నదాతలు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. చేలల్లో వరి పంట తడిసి ముద్దవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బి.సావరంలో రైతులు వరి చేలల్లో పంట కోసం ధాన్యం రాశులను గుట్టగా పోగుచేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కారణంగా ధాన్యం రాశి చుట్టూ వర్షం నీరు చేరింది. అకాల వర్షాలతో చేతికి అంది వచ్చిన వరి పంట తడిసి ముద్దవ్వడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు గోనె సంచులను వెంటనే సరఫరా చేసి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరారు. బి.సావరంలో వరి చేలను రాజోలు మండల వ్యవసాయాధికారి మధుకుమార్ పరిశీలించారు.

దాళ్వా రైతును దెబ్బకొట్టిన వర్షం

ఉప్పలగుప్తం, మే 4(ఆంధ్రజ్యోతి): ఆదివారం కురిసిన భారీ వర్షం దాళ్వా రైతులను అయోమయంలో పడేసింది. ప్రధానంగా కళ్లాల్లోని ధాన్యం రాశులు వర్షం నీరు చేరడంతో అడుగు భాగంలో గింజలు మొలకెత్తే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో ఇప్పటికీ ధాన్యం కళ్లాల్లోనే ఉంది. రక్షణ ప్రదేశానికి తరలించుకుందామంటే కూలీలు దొరక్క ధాన్యం రాశులు తడిసిపోయినట్టు రైతులు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో చేలల్లో పైరు పనల దశలో వుంది. ఇక ఎండుగడ్డిని పొలాల నుంచి తెచ్చుకునేందుకు కూలీలు కోసం ఎదురుచూస్తున్న సమయంలో వర్షం దెబ్బకొట్టడంతో పశు గ్రాసానికి కూడా నోచుకోలేక పోయామంటూ రైతులు లబోదిబోమంటున్నారు. అయితే మండలంలో 6000 ఎకరాలకుగాను ఇంకా రెండు వేల ఎకరాల్లో కోతలు జరగవలసివుందని వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు తెలిపారు.

40మిల్లీ మీటర్ల వర్షపాతం

ముమ్మిడివరం, మే 4(ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమై ఆదివారం ఉదయం ఒక్కసారిగా గాలులతో కూడిన వర్షం కురిసింది. ముమ్మిడివరంలో పలు రోడ్లు నీట మునిగాయి. ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పలు రోడ్లు నీట మునిగాయి. ఆసుపత్రుల రోడ్డు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు రోడ్డుతో పాటు పలు కాలనీల రోడ్లు నీట మునిగాయి. వర్షంతో వ్యవసాయ మూళ్ల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆదివారం ఉదయం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై అధికంగా వర్షం కురిసింది. దీంతో కళ్లాల్లోను, చేలల్లోను ఉన్న రైతులు వేసుకున్న ధాన్యం రాశుల కిందకు వర్షపు నీరు ప్రవేశించింది. వర్షం కురవడంతో వరి కోత పనులు నిలిచిపోయి వరి కోసే యంత్రాలకు పనులు ఆగిపోయాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం రాశుల కిందకు వెళ్లిన నీటిని కిందకు మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే ధాన్యం రాశులను కూడా బరకాలతో కప్పి వాటిని భద్రపరచుకునే చర్యలు చేపట్టారు.

ఈదురుగాలులతో జోరువాన

అంతర్వేది, మే 4(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ఆదివారం ఉదయం తెల్లవారుజామున కురిసిన వర్షాలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మండలంలో అక్కడక్కడా వరి కోతలు ముగిసి ధాన్యాం ఒడ్డుకు చేరే సమయంలో కురిసిన వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. అంతర్వేదిపాలెం, వీవీమెరక, శృంగవరప్పాడు తదితర గ్రామాల్లో రైతులు ఈదురుగాలులతో కూడిన వర్షాలకు ఇక్కట్లకు గురయ్యారు. అంతర్వేది సముద్రతీర ప్రాంతంలో జోరువానకు అక్కడక్కడా కొబ్బరి చెట్లు విరిగి నేల కొరిగాయి. తాటాకిల్లు సైతం గాలులకు పైకప్పులు ఎగిపోవడంతో బరకాల సాయంతో ఇంటి పైకప్పులను బరకాలతో కప్పుకున్నారు. వరి చేలలో మెరక పనులు చేసుకునే రైతులు, కొబ్బరి పొలాలకు మట్టి తోలుకునే రైతులు వర్షాలు రావడంతో పనులు వాయిదా వేసుకున్నారు.

వర్షాలతో అన్నదాతలకు కష్టాలు

అల్లవరం, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణంతో కురుస్తున్న అకాల వర్షాలకు మండలంలోని రైతులు ఆందోళనకు గురయ్యారు. మండలంలోని దాళ్వా చేలల్లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతుండగా పలుచోట్ల ధాన్యం పంట కళ్లాల్లో రాశులుగా, వరి చేలపై పనలుగా ఉన్నాయి. కొందరు రైతులు ధాన్యం రాశులపై బరకాలు కప్పి వర్షాల నుంచి రక్షణ చర్యలు చేపట్టారు. అల్లవరం, దేవగుప్తం, యెంట్రుకోన, గూడాల, గోడితిప్ప, డి.రావులపాలెం గ్రామాల్లో అకాల వర్షాలతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. మరో పక్క భారీ వర్షాలతో ఆక్వా రైతులు తీవ్ర కలత చెందారు. గట్లు వర్షాలకు దెబ్బతినగా కొందరు రైతులు రొయ్య, చేపల పంటలను ఆపా వలలతో రక్షణచర్యలు చేపట్టారు.









రాజోలు: బి.సావరంలో ధాన్యం రాశి చుట్టూ చేరిన వర్షం నీరు, ఉప్పలగుప్తం: కీత్తనచెరువులో ధాన్యం రాశి చుట్టూ చేరిన నీటిని తోడుతున్న రైతు, మామిడికుదురు: వర్షానికి చేలల్లో నానుతున్న వరిపనలు,పి.గన్నవరం శివారు చిట్టిలంకపేటలో చేల మధ్యలో ఉన్న ధాన్యం రాశి

విద్యతోనే సమాజంలోని అసమానతలు దూరం



సభలో మాట్లాడుతున్న గీతం యూనివర్శిటీ ప్రొఫెసర్ ప్రజ్ఞ

ముమ్మిడివరం, మే 4(ఆంధ్రజ్యోతి): సమాజంలో అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పరితపించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని గీతం యూనివర్శిటీ ప్రొఫెసర్ సి.ప్రజ్ఞ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన అంబేడ్కర్ 134వ జయంతి వేడకల్లో భాగంగా అక్కడ ఏర్పాటుచేసిన అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ప్రొఫెసర్ ప్రజ్ఞ ఆవిష్కరించారు. అంబేడ్కర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంటి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత చదువులు అభ్యసించడం ద్వారా సమాజంలోని అసమానతలు తొలగించవచ్చునన్నారు. అంబేడ్కర్ మానవ హక్కుల ఉద్యమనేతగా దళిత వర్గాలకు కాకుండా మహిళలు, శ్రామికులు, కర్షకుల కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. మరో ముఖ్య అతిథి బోరుగడ్డ సుబ్బయ్య మాట్లాడుతూ యువత చదువుపై దృష్టి సారించి శాస్త్రీయ జీవన విధానం అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో చెల్లి అశోక్, అడబాల సతీష్‌కుమార్, చెల్లి సురేష్, కాశి వెంకటాచార్య, యువజన సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినుల కలయిక

ముమ్మిడివరం, మే 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థినులు ఒక్కచోటకు వేదికై గత స్మృతులను జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని తమ అనుభవాలను పంచుకున్నారు. ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 2003-2004 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థినులు ఆదివారం ఒక్కచోటకు కలుసుకున్నారు. ఆనాడు పాఠాలు బోధించిన జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ పరిమళ, ఉపాధ్యాయినిలు ఆర్.మమత, ఎంవీ మహాలక్ష్మి, ఎస్.ఇందిర, బి.మంగాదేవి, డి.నాగలింగేశ్వరరావు, ఎ.ఉదయశేషారత్నం, కె.బేబీపద్మజ, జి.రత్నకుమారి, పి.వరలక్ష్మి, పి.గోపాలకృష్ణంరాజులతో పాటు పాఠశాల సహాయకులు ఎస్.గోవింద్, ప్రసాద్‌లను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు ఎస్.జ్యోతి, ఎస్.లోవతల్లి, జి.భ్రమరాంబ, జోత్స్న, పి.శిరీష, కె.నాగరత్నం, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఆర్ఎల్జీ కళాసమితి వార్షికోత్సవం

రాజోలు, మే 4 (ఆంధ్రజ్యోతి): పొదలాడ ఇందిరా కాలనీలో ఎస్ఆర్ఎల్జీ కళాసమితి 62వ వార్షికోత్సవం కళాభవన్ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఆర్ఎల్జీ కళాసమితి అధ్యక్షుడు పుల్లెల లక్ష్మీవర ప్రసాద్ ఆధ్వర్యంలో పౌరాణిక, సాంఘిక పద్య, నాటిక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తొలుత స్వర్గీయ పుల్లెల కొండయ్య చిత్రపటానికి సోషల్ వర్కర్, న్యాయవాది యాలంగి రమేష్ పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్ఆర్ఎల్జీ కళాసమితిని కొండయ్య ఏర్పాటు చేశారని రమేష్ తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్ల రాజేశ్వరి, చుట్టుగుళ్ల సత్యనారాయణ, కలి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడికి సమర్పించే ధనస్సుకు పూజలు



కాట్రేనికోన, మే 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి ఆర్థిక సహకారంతో అయోధ్య రాముని కోసం ఒక కేజీ వెండి, 13 కేజీల వెండితో ధనస్సు, బాణం, గద తయారు చేయించారు. వీటికి ఆదివారం పార్వతీకుండలేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో పూజలు నిర్వహించిన అనంతరం అయోధ్యలో రామునికి సమర్పించనున్నట్టు చల్లా శ్రీనివాసశాస్త్రి తెలిపారు. గతంలో పాదాలు బహూకరించామన్నారు.


తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



కేశనకుర్రులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, మే 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. కేశనకుర్రులో ఆదివారం ఆయన పర్యటించారు. కేశనకుర్రు పంచాయతీ పేర్రాజుచెరువులో రూ.23.50లక్షలు, అరుంధతీపాలెంలో 24.20లక్షలతో నిర్మించే 20వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర సత్యకుమారి, నీటి పంపిణీ సంఘం అధ్యక్షుడు చిలువూరి సుబ్బరాజు, గాదిరాజు విశ్వనాధరాజు, వనచర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో అధ్వానంగా పేరాయి'చెరువు' రహదారి



ఉప్పలగుప్తం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఉప్పలగుప్తం నుంచి పేరాయిచెరువు వెళ్లాలంటే స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రధాన గ్రామం నుంచి నిత్యం రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే ఈ రహదారే దిక్కు. పేరాయిచెరువు, ఆదిలక్ష్మీపురం, ఏటిమెరక, మధురవారిపేట, బడుగువారిపేట తదితర ప్రాంతాల ప్రజలు ఉప్పలగుప్తం రావాలంటే ఈరహదారిపై నిత్యం తిప్పలు పడాల్సిందే. గత ఐదేళ్లుగా ఈరహదారిని పట్టించుకోలేదు. వాస్తవానికి ఈరహదారిని ఓఎన్జీసీ అభివృద్ధి చేయవలసివుంది. ఈరహదారిపై ఓఎన్జీసీ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత వర్షాకాలంలో రహదారిని ఆధునికీకరించాలంటూ గ్రామస్తులు ఓఎన్జీసీ వాహనాలను అడ్డుకుని ఆందోళన చేశారు. రహదారి ఆధునికీకరిస్తామని ఓఎన్జీసీ అధికారులు మాట ఇచ్చారు. ఇప్పటికీ అమలు కాలేదు. కొద్దిపాటి వర్షం వచ్చినా గోతుల్లో నీరుచేరి ఈరహదారి నిజంగానే 'పేరాయి'చెరువు'గా మారిపోతోంది. రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వానజడులకు గోతుల్లో నీరు చేరడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మలికిపురం, మే 4(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రతీ ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని బట్టేలంక సర్పంచ్ బోనం సీతారత్నం అన్నారు. ఆదివారం బట్టేలంకలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి నవధాన్యాల సాగుపై రైతులతో చర్చించారు. రసాయన రహిత వ్యవసాయాన్ని చేయడం ద్వారా, ఆ ఉత్పత్తులు తినడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం పెరుగుతుందని, ఎక్కువ దిగుబడులు వస్తాయన్నారు. యూనిట్ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు, కిరణ్, జోసెఫ్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం

మలికిపురం, మే 4(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎత్తువంతెన వద్ద నిర్మించిన హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయానికి ఆదివారం మలికిపురానికి చెందిన ముదునూరి గంగరాజు దంపతులు రూ.10,116, కూసంపూడి సూర్యనారాయణరాజు రూ.5,116, ముదునూరి శివప్రసాదరాజు రూ.12,345, ముదునూరి సురేష్‌రాజు రూ.10వేలు, రుద్రరాజు వాసరాజు రూ.10,116 కమిటీ సభ్యులకు అందజేశారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సహాయం

మలికిపురం, మే 4(ఆంధ్రజ్యోతి): అడివిపాలెంలో రెండు కిడ్నీలు పాడై డయాలసిస్ చేయించుకుంటున్న బి.పాండురంగారావుకు ఆదివారం పాలకొల్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రూ.15వేలు విలువైన మందులను అందజేశారు. అదేవిధంగా హోప్ హెల్పింగ్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు రూ.5వేలు, రూ.1500 విలువైన నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జల్లి సుజాత, సర్పంచ్ కొల్లు నరసింహస్వామి, కోళ్ల వెంకటేశ్వర్లు, బోనం రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు నగదు పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యేగిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, మే 4(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యం పెరుగుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. బి.దొడ్డవరం గ్రామదేవతలు ముత్యాలమ్మతల్లి, గోగులమ్మతల్లి అమ్మవార్ల జాతర పురస్కరించుకుని ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు నగదు పురస్కారాలను ఎమ్మెల్యే అందించారు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పేరూరి సతీష్ సమకూర్చిన నగదును మొదటి బహుమతిగా రూ.8వేలు విన్నర్‌గా నిలిచిన పెదపట్నంలంక జట్టుకు, రెండో బహుమతిగా రూ.2వేలను రన్నర్‌గా నిలిచిన అప్పనపల్లి జట్టుకు అందించారు.కాకి సాయి, జవ్వాది నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

అల్లవరం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాల్లో ఈనెల5 నుంచి 15వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సున్నా నుంచి ఆరేళ్ల వయసు గల పిల్లల ఆధార్ నమోదు, ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్, తప్పులు, సవరణ చేసుకోవచ్చన్నారు.

ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలి

వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల డిమాండ్

అమలాపురం, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రైతులను దళారుల పాలు చేస్తుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆరోపించారు. అమలాపురంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తే లక్షా 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయని పరిస్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉందని ఆరోపించారు. దళారులకు ధాన్యం విక్రయించుకుని రైతులు మొత్తం నష్టపోయే పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా వైసీపీ ఉద్యమ కార్యాచరణకు సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, అమలాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్ పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా ఎం.ఎం.శెట్టి



అంబాజీపేట, మే 4(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం శెట్టిబలిజ అధ్యక్షుడు జి.అగ్రహారం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు మట్టపర్తి మీరా సాహెబ్‌శెట్టిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గంగలకుర్రు అగ్రహారంలో రెండు గ్రామాల శెట్టిబలిజ నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎం.ఎం.శెట్టిని అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం శెట్టిని నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, విత్తనాల శేఖర్, కట్టా సుబ్రహ్మణ్యం, పలివెల సుబ్రహ్మణ్యం, గుడాల ఫణి, మట్టపర్తి రెడ్డమ్మ, కొప్పిశెట్టి రాంబాబు, రాయుడు చంటి, రాయుడు మీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష ప్రశాంతం

యానాం, మే 4(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం యానాం జవహర్ నవోదయ విద్యాలయంలో నీట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. యానాంలో నవోదయ సెంటర్‌లో 134మంది విద్యార్థులకు ఒక విద్యార్థి వినహా మిగిలిన వారందరూ పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష జరిగింది. ఈపరీక్ష కేంద్రాన్ని యానాం పరిపాలనాధికారి మునిస్వామి, విద్యాలయం ప్రతినిధులు ప్రకాశరావు, శరత్‌చంద్రకీర్తి, యానాం విద్యాశాఖాధికారులు పరిశీలించారు.

డీవీరాజుకు మల్లాడి పరామర్శ

యానాం, మే 4(ఆంధ్రజ్యోతి): యానాం స్పైవిజన్ అధినేత, ఎంఎస్‌వో దంతులూరి వెంకటేశ్వరరాజుకు పితృవియోగం కలిగింది. రెండు రోజులు క్రితం డీవీరాజు తండ్రి సీతారామరాజు(80) మృతిచెందారు. ఆదివారం డీవీరాజు ఇంటికి ఆదివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వెళ్లి పరామర్శించారు. సీతారామరాజు చిత్రపటానికి మల్లాడి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే నల్లం విద్యా సంస్థల అధినేతనల్లం నాగబాబు తదితర ప్రముఖులు డీవీరాజును పరామర్శించారు.

ఘనంగా అమ్మవార్లకు సేవ

మామిడికుదురు, మే 4(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం గ్రామంలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మతల్లి, గోగులమ్మతల్లి అమ్మవార్లకు సేవా కార్యక్రమాన్ని శనివారం రాత్రి శాలివాహనులు (కుమ్మర్లు) ఘనంగా నిర్వహించారు. ముందుగా భారీ గజమాలలను భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం కొత్తపేట కళాకారులు నిర్వహించిన గరగ నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

మండపేట

విద్యా ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యం

మంత్రి సుభాష్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 4 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాల పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం రామచంద్రపురంలో పీఎం ఉషా పథకం క్రింద మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. సర్వారాయ షుగర్స్ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన ఫర్నిచర్‌ను మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉషా పథకం క్రింద రాష్ట్రంలోని 19 కళాశాలలకు నిధులు మంజూరు చేసిందన్నారు. ఉషాపథకం నిధులతో 13 అదనపు తరగతి గదులు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వార్డు కౌన్సిలరు వాడ్రేవు సాయి ప్రసాద్, కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.5.49 లక్షలు

ఆత్రేయపురం, మే 4(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,49,224 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

భవన నిర్మాణానికి విరాళం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కాతేరుకు చెందిన వెంకటేష్, ప్రణవిచౌదరి కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళాన్ని ఇచ్చారు. ఆలయ సిబ్బంది దాతలకు స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.

కేశవస్వామి ఆలయంలో:

ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమణమూర్తి ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మొక్కు చెల్లించుకున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కె.గంగవరం, మే 4(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధిస్తే గంగవరం చిన్న మంద చర్చిలో ప్రార్థన చేయిస్తానని కాపవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కొండేపూడి రవి ఎన్నికల సమయంలో మొక్కుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆయన విజయం సాధించడంతో ఆదివారం ఆయన చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్ జకారియా ఆయన కోసం పలు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్‌కు, చిన్న మంద చర్చి సంఘస్తులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.


చర్చిలో ప్రార్థనలు చేస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

హెచ్‌ఎం కుటుంబానికి ఆర్థికసాయం


ప్రధానోపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మే 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల ర్యాలి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేగేశ్న సత్యనారాయణరాజు గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆదివారం పీటీసీ మిత్రబృందం ఆయన స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి చెందిన ఉపాధ్యాయుడి చిత్రపటానికి వారు నివాళులర్పించారు. ప్రకాశం జిల్లా మైనంపాడుకు చెందిన 1992-93 పీటీసీ ఉపాధ్యాయ మిత్ర బృందం రూ.1.05 లక్షలను ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. మిత్ర బృందం ప్రతినిధులు ఏఎస్‌డీ ప్రసాదరావు, పడగా సత్తిబాబు, ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఐఎస్‌వీవీ ప్రసాద్, అప్పటి గురువులు, సహాయం అందించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.


చెల్లూరులో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

రాయవరం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. చెల్లూరు గ్రామానికి చెందిన మార్ని అనసూయ, తాడి ఆదిరెడ్డి ఇటీవల మృతి చెందగా ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, మాజీ సర్పంచ్ నూనె ఏసుబాబు, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు తదితరులు ఉన్నారు.

కపిలేశ్వరపురం మండలంలో...

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన గుడిమెట్ల పార్వతి, వల్లూరు రాంబాబు, అంగర గ్రామానికి చెందిన ఉయ్యూరి కృష్ణారావు ఇటీవల మృతి చెందగా ఆదివారం ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు రుద్రాక్షల సోమేష్, వల్లూరి శ్రీనివాస చౌదరి, కడలి గోవిందరాజు తదితరులు ఉన్నారు.

దర్శకరత్న దాసరికి పలువురి నివాళి


ఏడిదలో దాసరి నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కామన తదితరులు

మండపేట, మే, 4(ఆంధ్రజ్యోతి): దర్శకరత్న దాసరి నారాయణరావు సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. ఏడిదలో వున్న దాసరి నారాయణరావు భవన్ ట్రస్టు ఆధ్వర్యంలో దాసరి జయంతి సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దాసరి జయంతిని పురస్కరించుకుని మిఠాయిలు పంచారు. అయనకు భారతరత్న ఇవ్వాలని ప్రభుత్వాన్ని కామన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాడిశెట్టి సత్యనారాయణ, వాసిరెడ్డి బాబురావు, చింతలపూడి బాబి, గండ్రోతుల సురేష్, వల్లభదాసు చిన్న, కె.బాబి, నరేడ్ల సాయి, యర్రంశెట్టి పవన్, కాకరపర్తి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్లకు సేవ

మామిడికుదురు, మే 4(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం గ్రామంలో ఉన్న ముత్యాలమ్మతల్లి, గోగులమ్మతల్లి అమ్మవార్లకు సేవా కార్యక్రమాన్ని శనివారం రాత్రి శాలివాహనులు (కుమ్మర్లు) ఘనంగా నిర్వహించారు. ముందుగా భారీ గజమాలలను భక్తులు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవార్లకు అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

అయోధ్య రాముడికి సమర్పించే ధనస్సుకు పూజలు

కాట్రేనికోన, మే 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి ఆర్థికసహకారంతో అయోధ్య రాముడికి కిలో వెండి, 13 కిలోల వెండితో ధనస్సు, బాణం, గద చేయించారు. వీటికి ఆదివారం పార్వతీ కుండలేశ్వరస్వామి సన్నిధిలో పూజలు చేశారు.


కె.గంగవరం మండలం పామర్రు హైస్కూల్ గ్రౌండ్‌లో ధాన్యం రాశుల వద్దకు చేరిన వర్షం నీరు


ఆత్రేయపురం మండలంలో ధాన్యం రాశులపై కప్పిన బరకాలు


రాయవరంలో ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతు

అకాల వర్షం...అపార నష్టం

• వాతావరణ మార్పులతో రైతుల్లో కలవరం • ఈదురుగాలులకు నేలకొరుగుతున్న అరటి • ముద్దవుతున్న ధాన్యం రాశులు


కపిలేశ్వరపురం-అంగర రహదారిలో ధాన్యం రాశుల వద్దకు చేరిన నీటిని తొలగిస్తున్న రైతులు

రాయవరం, మే 4(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో అకాల వర్షాలకు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కోతదశకు వరి పంట రావడంతో రైతులు ముమ్మరంగా వరికోతలు చేపట్టారు. నాలుగు రోజుల నుంచి వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు వారిని కలవరపెడుతున్నాయి. రైతుల వద్ద నుంచి దళారులు రూ.1500కు కొనుగోలు చేయడంతో రైతులు గగ్గోలుపెడుతున్నారు. అసలే ధరలేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ధాన్యం తడిస్తే మరింత తక్కువకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇటీవల వరికోతలు చేసిన రైతులు రోడ్లు, ఖాళీస్థలాల్లో ధాన్యానికి బరకాలు కప్పి ఉంచారు. ఆదివారం ఉదయం కురిసిన వర్షాలకు పంట తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు.

పంటను కాపాడుకునేందుకు రైతుల హైరానా

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. తేమశాతం తగ్గించుకునేందుకు ఆరబెట్టిన ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు టార్పాలిన్‌లు, బరకాలు కప్పి రక్షణ చర్యలు చేపట్టారు. మండలంలో సుమారు 16వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటి వరకు 50శాతం వరి కోతలు పూర్తయ్యాయి. రైస్ మిల్లులకు కొంత ధాన్యం చేరుకుంది. తేమ శాతం తగ్గించేందుకు రైతులు రోడ్లు, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టారు. ఆదివారం ఉన్నట్టుండి వర్షం కురవడంతో వాటిని రక్షించే పనిలో హైరానా పడ్డారు. ధాన్యం రాశుల కిందకు వర్షం నీరు చేరుకుంది. పామర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరబెట్టిన ధాన్యం రాశుల కిందకు నీరు చేరిపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


రావులపాలెం మండలంలో ధాన్యం రాశులపై కురుస్తున్న వర్షం

అన్నదాతల ఆందోళన

కపిలేశ్వరపురం,(ఆంధ్రజ్యోతి): పంట చేతికందుతున్న సమయంలో ఆదివారం కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులకు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో పలు చోట్ల వరిపంట, చేలు నేలమట్టం కాగా, మరికొన్ని చోట్ల వరిపనలు తడిసిముద్దయ్యాయి. కోసిన పంటను బరకాలతో కప్పి ఉంచినప్పటికీ వర్షం నీరు చేరడంతో కొంత మేర ధాన్యం తడిసి ముద్దయ్యింది. రహదారుల వెంబడి, మెరక ప్రాంతాల్లో వేసిన ధాన్యం రాసుల వద్ద వర్షం నీరు చేరడంతో రైతులు నీటిని తరలించే పనిలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం కొద్దిగా వర్షం తగ్గడంతో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలోపడ్డారు. వర్షానికి పలు ఇటుకబట్టీలు తడిసి ముద్దయ్యాయి. కొన్నిచోట్ల బరకాలు కప్పి వాటిని కాపాడుకున్నారు. అరటి, కూరగాయలు తదితర పంటలకు కలిగింది. చేతికి వచ్చిన పంటలు నష్టానికి గురవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముద్దయిన ధాన్యపు రాశులు

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల నుంచి ఈదురుగాలులు వర్షాల కారణంగా ధాన్యపు రాశులు తడిసి ముద్దవుతున్నాయి. మాసూళ్లు చేసిన ధాన్యాన్ని రైతులు కల్లాల్లో ఆరబెట్టుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలో 80 శాతం వరికోతలు పూర్తవగా రైతుల వద్ద నుంచి 33 శాతం ధాన్యం కొనుగోలు చేశారు. మిగిలిన ధాన్యం కల్లాల్లోనే ఉంది. తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా ప్రాంతాల్లో ధాన్యపు రాశులు కల్లాల్లో ఉన్నాయి. ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి ధాన్యం రాశులచుట్టూ వర్షపు నీరు చేరింది. దీంతో రైతులు బరకాలతో వాటిని భద్రపరుచుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో పంట పొలాల్లో ధాన్యం రాశులు ఉండటంతో కొంత మేర అవి తడిసిపోయాయి. రైతులు మధ్యాహ్న సమయం లో వాటిని ఆరబెట్టుకునే పనిలో పడ్డారు.

రైతులకు భారీ నష్టం

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): పంట చేతికొచ్చే సమయంలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి రైతులు కలవరం చెందుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కురిసిన వర్షానికి ఆరబెట్టిన ధాన్యాన్ని రక్షించుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. వర్షం పడటంతో రెండు రోజులపాటు వరి మాసూళ్లకు ఆటంకం కలుగుతుందని రైతులంటున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కురిసిన అకాల వర్షంతో తడిచిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్ననాయుడు, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌లతో మాట్లాడినట్లు తెలిపారు. తడిచిన ధాన్యం తేమ ఉన్నా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. రేపటి నుంచి క్షేత్రస్థాయి పరిశీలన చేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రేపటి నుంచి రైతులకు అందుబాటులో ఉండి సహకరించాలని ఆదేశించారు.


ఆలమూరు మండలం చింతలూరులో ధాన్యం రాశులకు రక్షణగా కప్పిన బరకాలు


ఎంపీ బోస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఎంపీ బోస్‌ను కలిసిన జగ్గిరెడ్డి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు, వైసీపీ పీఏసీ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను ఆదివారం వైసీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి కలిశారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయం వద్ద ఎంపీని కలసి సత్కరించి పుష్పగుచ్ఛం అందచేశారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు గోడ నిర్మించే వరకు దీక్ష విరమించేది లేదు

వల్లూరి శ్రీవాణి



మండపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): కేశవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించే వరకు శాంతి దీక్ష విరమించేది లేదని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి అన్నారు. హైస్కూల్ గోడ నిర్మాణం కోసం ఆమె చేస్తున్న దీక్ష ఆదివారం 17వ రోజుకు చేరింది. ఆక్రమణలకు గురైన పాఠ శాల స్థలంపై సర్వే నిర్వహించి ఆక్రమణ లను తొలగించి ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తాను శాంతిదీక్షను విరమించేదిలేదని ఆమె స్పష్టం చేశారు.

నేడు బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో ఈనెల 15 నుంచి 18 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే బాలురు, బాలికల జట్టును సోమవారం ఎంపిక చేస్తామని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రామచంద్రపురం ప్రతినిధులు తెలిపారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మే 5న ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు, క్రీడాకారిణులు 1 జనవరి 2012 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజు ఫొటో తీసుకురావాలని వారు తెలిపారు.

సాహిత్య రంగానికి స్వామిప్రసాద్ సేవలు ప్రశంసనీయం

మండపేట, మే 4(ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన అభ్యుదయ కవి, రచయిత జి.స్వామిప్రసాద్‌ను రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ సేవా కేంద్రం నిర్వాహకులు సత్కరించారు. సాహిత్య రంగానికి ప్రసాద్ చేస్తున్న సేవలను నిర్వాహకులు కొనియాడారు. అంబేద్కర్ సేవా కేంద్రం నిర్వాహకులు గుబ్బల రాంబాబు, పూలే సామాజిక కేంద్రం నిర్వాహకులు నయనాల కృష్ణారావు, విశ్రాంత ప్రిన్సిపాల్ పాకా చంద్రరావు, ప్రొఫెసర్ చిలుకోటి కూర్మయ్య, ప్రముఖ కవి, గూటం స్వామి తదితరులు ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను పాఠశాల హెచ్‌ఎం సవితాల సుబ్రహ్మణ్యం, సహచర ఉపాధ్యాయులు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్ రాష్ట్ర కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ తదితరులు అభినందించారు.


అభ్యుదయ రచయిత ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పామర్రులో కైలాసభూమి ప్రారంభం

కె.గంగవరం, మే 4(ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామంలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ నిధులతో అభివృద్ధి చేసిన కైలాస భూమిని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆదివారం ప్రారంభం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పామర్రులోని శ్మశానవాటిక అభివృద్ధికి తాము ఇచ్చిన నిధులతో పాటు గ్రామస్తుల సహకారంతో విరాళాలు ఇచ్చి పూర్తి చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో గుర్రాల సత్యనారాయణ, వాసంశెట్టి సూరిబాబు, పంపన సుబ్బారావు, సాదే కపిల్, నున్న సత్యనారాయణ, పెన్నాడ త్రిమూర్తులు, చెలుబోయిన శ్రీనివాసరావు, గంజా మూర్తి, కుడుపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


శ్మశానవాటిక శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భార్యను గాయపర్చిన ఘటనపై కేసు నమోదు

రాయవరం, మే 4(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థల నేపథ్యంలో భార్యపై కత్తితో దాడిచేసి గాయపర్చిన సంఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. రాయవరంలో ఆదివారం రాత్రి ఎస్ఐ మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన దూలం సత్యకుమారికి శ్రీనుతో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. సోమేశ్వరంలో అత్తారింటి వద్ద ఉంటున్న శ్రీను స్థానిక ఇటుకలబట్టీలో పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మూడు నెలల నుంచి వారు దూరంగా ఉంటున్నారు. ఆదివారం ఉదయం శ్రీను భార్య సత్యకుమారిపై కత్తితో గాయపర్చగా వెంటనే ఆమెను స్థానికులు, బంధువులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారం, బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిమ్స్‌లో ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు



స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్న కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది

అమలాపురం, మే 4(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి దశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం సుదర్శన హోమం, పూర్ణాహుతి, చక్రస్నాన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామోత్సవంలో భాగంగా స్వామివారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక వాహనంపై ఉంచి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం పర్యంకశయనోత్సవం, ఆశీర్వచనం, పండిత సత్కారం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాల వితరణ జరిగాయి. కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు-బదరీలక్ష్మి, ఎండీ కె.రవికిరణ్‌వర్మ-శేషపవిత్ర దంపతులు కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


బ్యూటీషియన్ కోర్సు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

వృత్తి నైపుణ్య శిక్షణతో మహిళలకు ఉపాధి కల్పన

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 4 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్య శిక్షణ పొందడం ద్వారా మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు నెలరోజులపాటు అందించే బ్యూటీషియన్ కోర్సు శిక్షణ తరగతులను మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ ఏర్పాటు చేసి బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేసి మహిళలు స్వయం ఉపాధి పొందేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సమావేశంలో కూటమి నాయకులు వైట్ల గజలక్ష్మి, ఎ.రిష్వంత్‌రాయ్, కౌన్సిలరు అంకం శ్రీనివాస్, గుణ్ణం వినోద్‌కుమార్, దంగేటి గౌరీశంకర్, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, బ్యూటీషియన్ కోర్సు శిక్షణకు ఎంపికైన మహిళలు పాల్గొన్నారు.


సోమేశ్వరం శివాలయం వద్ద పందిరి రాట పూజ చేస్తున్న దృశ్యం

సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు శ్రీకారం

రాయవరం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమేశ్వరం బాల త్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పందిరిరాట పూజను నిర్వహించారు. ఆలయ అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత వినాయకపూజ, అర్చనలు, హారతులు నిర్వహించిన అనంతరం పందిరి రాట వేసి ఉత్సవాలకు శ్రీకారం చేశారు. ఈనెల 8 నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ రావుల రామకృష్ణ, టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే. పరమహంస, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు శాకా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.